సాక్షి నిర్మల్

7

శనివారం । 16 । ఆగస్టు । 2025




మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ



గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూజలు చేస్తున్న రాజయ్య

న్యూస్‌రీల్

మూడో ఆర్థిక శక్తిగా భారత్

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



జెండా ఆవిష్కరిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారతదేశం ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఆవిష్కృతమవుతుందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, గాంధీపార్క్, ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా, పట్టణ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ జిల్లా టాపర్లకు నగదు ప్రోత్సాహం



చెక్కు అందిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యాసంవత్సరం పదో తరగతి, ఇంటర్‌లో జిల్లా టాప్ నిలిచిన విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వం నగదు బహుమతిని అందజేసి సత్కరించింది. జిల్లా వ్యాప్తంగా 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున కలెక్టర్ అభిలాష అభినవ్ అందించారు. ఎ.సాహిత్య, సాత్విక (పదో తరగతి) సోఫినగర్ గురుకుల పాఠశాల, విఘ్నేశ్వర్ (పదో తరగతి) కుంటాల మోడల్ స్కూల్, రాజు (పదో తరగతి), మస్కాపూర్ హైస్కూల్, అంజలి, సుప్రియ (ఇంటర్) సోఫీనగర్ కళాశాల, ఈ.అశ్విత్, ముత్యం (ఇంటర్) కుంటాల మోడల్ స్కూల్ విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు.

గోదావరిలో మువ్వన్నెలు



లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, గొడిసెరా, పంచగుడి తదిరత గ్రామాల మత్స్యకారులు పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరి నదిలో శుక్రవారం చేపల వేటకు వెళ్లారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని నదిలో తెప్పలపైనే త్రివర్ణ పతాకం ఎగురవేశారు. కార్యక్రమంలో మత్స్యకారులు గంగాధర్, సాయిలు, మాడబోయి గంగాధర్, మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త జెండా ఏర్పాటు చేయరా?



నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ జాతీయ జెండా చిరిగిపోయింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజైనా అధికారులు కొత్తది ఏర్పాటు చేయలేదు. దీని పక్కనే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అధికారులు దీనిని గమనించలేదు. అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

అన్నిరంగాల్లో అభివృద్ధి

- త్యాగధనుల ఆశయాలు సాధిద్దాం..
- జిల్లాను అభివృద్ధి చేసుకుందాం
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- జిల్లాకేంద్రంలో జాతీయ పతాకావిష్కరణ
- ఘనంగా జెండా పండుగ



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య



జాతీయ జెండాకు వందనం చేస్తున్న స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, జిల్లా అధికారులు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నిర్మల్: బ్రిటీష్ కబంధ హస్తాల నుంచి దేశాన్ని విడిపించేందుకు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన త్యాగధనులు, సమరయోధుల త్యాగఫలమే నేటి మన స్వాతంత్ర్యమని, వారి త్యాగాలను స్మరిస్తూ.. వారి ఆశయాల సాధనకు కృషి చేద్దామని, జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యఅతిథి హాజరయ్యారు. త్రివర్ణ పతాకం ఆవిష్కరించారు. జెండా వందం చేసి జాతీయగీతం ఆలపించారు. అనంతరం పోలీసుల గౌరవ వంద నం స్వీకరించారు. తర్వాత తన ప్రసంగం వినిపించారు. కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, అడిషనల్ కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్‌కుమార్, భైంసా సబ్‌కలెక్టర్ సంకేత్‌కుమార్, అడిషనల్ ఎస్పీలు రాజేశ్‌మీనా, అవినాశ్‌కుమార్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అర్జుమంద్‌అలీ వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమంలో ముందు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోనే రాష్ట్రప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంలో ముందు ఉంటోందన్నారు. ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జిల్లా సాధిస్తున్న ప్రగతిని వివరించారు.

'మహాలక్ష్మి' మొదలు..

ప్రజాప్రభుత్వం కొలువుదీరిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించేందుకు మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

- మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటిదాకా 4.45 కోట్ల మంది మహిళలు ఈ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈసేవలకు ప్రభుత్వం రూ.176.14 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు.
- జిల్లాలో ఇప్పటివరకు 19,351 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేశామని, 33,615 కొత్త రేషన్‌కార్డులు జారీ చేశామని తెలిపారు.
- 2024–25 వానాకాలానికి 29,838 మంది రైతుల నుంచి 1.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతుల ఖాతాల్లో రూ.264 కోట్లు జమచేసినట్లు తెలిపారు. సన్న బియ్యానికి రూ.500 బోనస్ అందించి, రూ.16.07 కోట్లు రైతుల ఖాతాల్లో చేశామన్నారు.
- జిల్లాలో ఈఏడాది మొత్తం 8,286 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 1,048 ఇళ్లు నిర్మాణదశలో ఉన్నాయని చెప్పారు.
- రైతు రుణమాఫీ పథకంలో భాగంగా 72,500 మంది రైతులకు రూ.658 కోట్లు వారి ఖాతాల్లో జమచేశామన్నారు. వానాకాలం పెట్టుబడిగా 1,85,500 మంది రైతులకు రైతుభరోసా ద్వారా రూ.268.70 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.
- జిల్లా గ్రామీణాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ ఎన్‌పీఏ రికవరీలో రాష్ట్రంలోనే మొదటిస్థానం సాధించడం గర్వకారణమన్నారు. కొండాపూర్‌లోని గణపతి స్వయం సహాయక సంఘం నిర్వహిస్తున్న సమీకృత వ్యవసాయ విధానానికి పెప్సికో సంస్థ రెవల్యూషనరీ అవార్డు, అలాగే చేపల ఉత్పత్తిలో మత్స్యసహాదారు అవార్డు దక్కడం ప్రశంసనీయమన్నారు. చించోలి(బి) సమీపంలో మహిళాశక్తి పెట్రోల్‌బంక్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు.

ఊళ్లు.. భూముల కోసం..

- దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి జాతీయ అభివృద్ధి సూచికలో ఐదోస్థానం సాధించడం అభినందనీయమని రాజయ్య పేర్కొన్నారు.
- జిల్లాలో నిర్వహించిన భూభారతి సదస్సుల్లో స్వీకరించిన 16,885 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 7,521 పరిష్కరించినట్లు తెలిపారు.
- ఉద్యానశాఖ ద్వారా ఆయిల్‌పాం పథకం కింద 1,058 ఎకరాలకుగానూ రైతులకు రూ.3.18 కోట్లు మంజూరు చేశామన్నారు.
- జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం నిర్వహించిన సీఎం కప్‌లో పాల్గొన్న విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 26 పతకాలు సాధించడం, అలాగే యువజనోత్సవాల్లో నిర్మల్ జిల్లా జానపద గ్రూప్ పాటకు ద్వితీయబహుమతి దక్కడం అభినందనీయమన్నారు.
- మత్తురహిత జిల్లా కోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది 585 గుడుంబా కేసులు నమోదు చేశామన్నారు. 20 మందికి పునరావాసం కల్పించినట్లు చెప్పారు.
- జిల్లాలో ఇప్పటిదాకా రూ.33.25 కోట్ల పెట్టుబడితో 36 పరిశ్రమలు స్థాపించి, 365 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించామన్నారు.

పెంబితో జాతీయస్థాయి గుర్తింపు..

- నీతిఆయోగ్ చేపట్టిన ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమానికి ఎంపికైన పెంబి మండలం వైద్యసేవలు, భూసార పరీక్షలు, రివాల్వింగ్ ఫండ్ తదితర అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించి జాతీయ స్థాయిలో నాలుగోస్థానంలో నిలువడం అభినందనీయమన్నారు.
- బాలశక్తి, నిర్మల్ ఉత్సవాలతో జిల్లా ప్రత్యేకత సంతరించుకుందని రాజయ్య ప్రశంసించారు.

శాంతిభద్రతలు, నారీశక్తి..

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లా పోలీసులు నారీశక్తిని చాటడం ప్రశంసనీయమన్నారు. మహిళా పోలీసులతో నారీశక్తి పేరిట గస్తీ, తనిఖీలు చేపట్టడం, శివంగి టీమ్ పేరిట ప్రత్యేక మహిళా కమెండో బృందం ఏర్పాటు, వసతిగృహ విద్యార్థినుల్లో భరోసా నింపేందుకు పోలీసు అక్క, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు గాంజా గస్తీ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

విద్య, వైద్యంలోనూ..

- బడిబాటలో భాగంగా ఈ ఏడాది 2,030మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పినట్లు రాజయ్య పేర్కొన్నారు. జిల్లాలో 20 పీఎంశ్రీ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.5 లక్షలతో ఖగోళ శాస్త్ర ప్రయోగశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా జిల్లాలోరూ.57.80 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాదిలో 1,502 ప్రసవాలు జరిగాయన్నారు. అమ్మరక్షిత ద్వారా జిల్లాలో 2,054మంది గర్భిణులకు వైద్యసేవలు, పోషణ అందించినట్లు తెలిపారు.
- జిల్లాలో మహిళ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖల ద్వారా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వరూపిణి నృత్య కళాక్షేత్రం విద్యార్థులు నమో నమో భారతం అనే దేశభక్తి గీతంపై నాట్యం చేశారు. విజయ హైస్కూల్ నిర్మల్, వికాస్ హైస్కూల్ భైంసా విద్యార్థులు ఇటీవల జరిగిన పహల్గాం దాడి సన్నివేశాలు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్‌తో మన సైనికులు చేసిన వీరోచిత పోరాటాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు.

స్టాళ్ల ఏర్పాటు..

వేడుకల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలశక్తి, వైద్య శాఖ, పౌరసరఫరాల శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, వ్యవసాయ శాఖ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఆయా శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను గురించి వివరించారు.




నృత్యం చేస్తున్న విద్యార్థు, విద్యార్థులకు బహుమతి అందజేసిన సిరిసిల్ల రాజయ్య, అధికారులు



బహుమతి అందుకునన భైంసా వివేక్ పాఠశాల విద్యార్థులతో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జిల్లా అధికారులు



జయ స్కూల్ విద్యార్థులతో సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, ఏఎస్పీలు..

ఇంకా లోటే..!

- జిల్లాలో సరిపడా కురవని వానలు
- ప్రాజెక్టులు ఫుల్.. చెరువుల్లో నిల్


భైంసాటౌన్: వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు దాటింది. అయినా, జిల్లాలో ఇప్పటివరకు భారీ వర్షాలు నమోదు కాలేదు. అడపాదడపా కురిసిన మోస్తరు వర్షాలకు జలాశయాలు, చెరువులు, కుంటలకు ప్రవాహాలు రాలేదు. అయితే ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. చెరువులు కుంటలు మాత్రం నిండని పరిస్థితి. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలకు ఢోకా లేకున్నా.. చెరువులు నిండాలంటే అధిక వర్షాలు కురవాల్సి ఉంది. తద్వారా వాటి కింద సాగుచేసే పంటలకు ఢోకా ఉండదు. జూన్, జూలైతోపాటు ఈనెల ఇప్పటివరకు భారీ వర్షాలు లేకున్నా.. రానున్న నాలుగైదు రోజుల్లో భారీ వర్షాలుంటాయన్న వాతావరణ శాఖ సూచనలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


జిల్లాలో ఇలా...

ఇప్పటివరకు కురిసిన వర్షాల ప్రకారం.. జిల్లాలో ఇంకా లోటు వర్షపాతమే నమోదైంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు 601.7 మి.మీల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా, 478 మి.మీల వర్షపాతం నమోదైంది. అంటే, 21 శాతం లోటు నమోదైంది. మండలాలవారీగా పరిశీలిస్తే.. 10 మండలాల్లో లోటు వర్షపాతం, మరో 10 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా కుభీర్(34), బాసర(31), దిలావర్‌పూర్(33), సోన్(31), లక్ష్మణచాంద(24), పెంబి(23), ఖానాపూర్(32), కడెం(30), దస్తురాబాద్(35) మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసింది.

జిల్లాలో సరాసరి వర్షపాతం ఇలా...

శుక్రవారం నమోదైన వర్షపాతం
3.9 మి.మీ
గతంలో నమోదైన సాధారణ వర్షపాతం
4.3 మి.మీ
లోటు వర్షపాతం 9శాతం
జూన్ 1 నుంచి ఇప్పటివరకు సరాసరి లోటు 21 శాతం





ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

గతేడాది అధికం..

గతేడాదితో పోలిస్తే.. గతేడాది జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు 912.4 మి.మీల సాధారణ వర్షపాతానికిగాను 1103.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 21 శాతం అధికంగా వర్షం కురిసింది. మండలాలవారీగా పరిశీలిస్తే.. కుభీర్, తానూర్, ముథోల్, భైంసా,కుంటాల, నర్సాపూర్(జి), ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, బాసర(39), లోకేశ్వరం(32), దిలావర్‌పూర్(24), సారంగపూర్(20), అత్యధికంగా నిర్మల్‌లో(53), నిర్మల్‌రూరల్(28),సోన్(21), లక్ష్మణచాంద(26), మామడ(27), పెంబి(25), కడెం(36) మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది.

నిండుకుండలా గడ్డెన్నవాగు

భైంసాటౌన్: ఎగువన కురిసిన వర్షాలకు భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు 1,238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రాజెక్టులో నీటిమట్టం 358.10 మీటర్లకు చేరింది. 10 గంటల నుంచి ఇన్‌ఫ్లో 15,416 క్యూసెక్కుల పెరిగింది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.50 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు అధికారులు రెండు గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ప్రాజెక్టు వద్దకు చేరుకుని పరిశీలించారు. ప్రాజెక్టు నుంచి వరద నీటి విడుదల నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల్లో పశువుల కాపర్లు, రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

నిండుతున్న ప్రాజెక్టులు...

రెండు, మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పుడిప్పుడే ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. జిల్లాలోని స్వర్ణ, కడెం ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో వరద నీరు రావడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు సైతం ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు శుక్రవారం ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7మీటర్లు కాగా, ప్రస్తుతం 358.5 మీటర్ల నీటిమట్టం ఉంది. దీంతో శుక్రవారం రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. జిల్లావ్యాప్తంగా చెరువులు, కుంటలు సైతం పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతో భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టులు, చెరువులు జలకళ సంతరించుకోనున్నాయి.

స్వాతంత్ర్య సంగ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: అధికారులంతా స్వాతంత్ర్య సంగ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు.79వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పతాకం ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు నోటు పుస్తకాలు, బహుమతులు, మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోనూ కలెక్టర్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమాలలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు..

మహనీయుల ఆశయాలతో ముందుకు..

- ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ టౌన్: దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎస్పీ జానకీషర్మిల అన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టవ్యవస్థను కాపాడడం మన బాధ్యత అన్నారు. నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణలో ప్రతిఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలి సూచించారు. వేడుకల్లో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఏవో యూనస్ అలీ, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, డీపీవో, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

కోర్టు ఆవరణలో స్వాతంత్ర్య వేడుకలు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టు ఆవరణంలో 79వ స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం ఘనంగా జిల్లా జడ్జి శ్రీవాణి జాతీయ జెండా ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల త్యాగాలను గుర్తు చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల ఆశయాలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి షేర్ నరేందర్, న్యాయవాదులు రాజశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న జిల్లా జడ్జి శ్రీవాణి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది

క్లుప్తంగా

దుర్గామాత ఆలయంలో చోరీ


దుండగులు పగుల గొట్టిన హుండీ

మామడ: మండలంలోని పొన్కల్ దుర్గామాత ఆలయంలోని హుండీని శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆలయానికి వెళ్లిన భక్తులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పంజేషా మొహల్లాకు చెందిన 18 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. చుట్టుపక్కలా గాలించినా ఆచూకీ లభించకపోవడంతో యువతి బాబాయి అజరుల్లా హక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అధిక ధరకు మద్యం విక్రయించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: వైన్‌షాపు నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్న భుక్తాపూర్‌కు చెందిన అల్లకుంట శివులు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. భుక్తాపూర్ ప్రాంతంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అమాయక ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి నుంచి రూ.1,070 విలువైన 1.62 లీటర్ల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముగ్గురు నిందితుల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: రాగి తీగ చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. వన్‌టౌన్ ఎస్సై రమ్య శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు రాగి తీగలతో ఉన్న సంచులు పట్టుకుని వెళ్తున్నారు. అనుమానం వచ్చిన ఎస్సై సంచులను పరిశీలించగా అందులో రాగి తీగలు లభించాయి. మహారాష్ట్రకు చెందిన దేవిదాస్, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని లాండసాంగ్వికి చెందిన రాజేశ్వర్, శివాజీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ప్రతిభకు ప్రశంసలు

జిల్లాలో వివిధ శాఖల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న 290 మంది ఉద్యోగులకు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సత్కరించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల ప్రశంసాపత్రాలు అందించారు. – నిర్మల్‌చైన్‌గేట్


ఎల్.కిశోర్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)


ఫైజాన్ అహ్మద్, అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) · జీవరత్నం, సీపీవో · రాజేశ్వర్‌గౌడ్, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి · శ్రీనివాస్, బీసీ సంక్షేమ అధికారి · రాంగోపాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ · శ్రీనివాసబాబు, జిల్లా భూగర్భజల శాఖ అధికారి · విష్ణువర్ధన్, డీపీఆర్వో


శంకర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి · జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, నిర్మల్ · జాదవ్‌కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఖానాపూర్ · పరశురాం, డీఐఈవో · డాక్టర్ సరోజ, జిల్లా ప్రసూతి ఆస్పత్రి హెచ్‌వోడీ · డాక్టర్ సౌమ్య, ప్రోగ్రాం ఆఫీసర్ · సూర్యారావు, ఏవో, కలెక్టర్ కార్యాలయం · అతీక్, కలెక్టర్ సీసీ · శేఖర్, నయాబ్ తహసీల్దార్, కలెక్టరేట్ · పి.అనంత్, కలెక్టర్ సీసీ · ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్


ఆర్.శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్, ఆర్డీవో, భైంసా · పండరి, ఆర్టీసీ డిపో మేనేజర్ నిర్మల్ · రహీం, అడిషనల్ కలెక్టర్ సీసీ · హరీశ్, అడిషనల్ కలెక్టర్ సీసీ · సమ్మయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, నిర్మల్ · రామ్‌నిరంజన్, సీఐ · ఏ.శంకర్, హోంగార్డ్ · జి.సురేశ్, కానిస్టేబుల్, నిర్మల్ · కూన సందీప్, కానిస్టేబుల్ · హెచ్.ప్రశాంత్, ఫైర్ కార్యాలయం · ముజాహిద్‌ఖాన్, వీసీ ఆపరేటర్, కలెక్టరేట్


రత్నకళ్యాణి, ఆర్డీవో నిర్మల్ · నాగజ్యోతి, సీనియర్ అసిస్టెంట్, సివిల్ సప్లయ్ · గొజ్జ నితీశ్, పంచాయతీ కార్యదర్శి · ఓస ప్రసాద్, ఏపీడీ · శ్రీనివాస్, మేనేజర్, మహిళా ప్రగతి · ఎం.పుష్ప, ఆఫీస్ సబార్డినేట్ · జయలలిత ఆఫీస్ సబార్డినేట్ · విజయలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 2, జీజీహెచ్ · స్పందన, హార్టికల్చర్ ఆఫీసర్ · ఎండీ.ఆరిఫ్, డ్రైవర్, అడిషనల్ కలెక్టర్ · సంతోష్, జూనియర్ అసిస్టెంట్ · అల్లాడి భూలక్ష్మి, గోపాలమిత్ర, కమల్‌కోట్, మామడ


ఏ.మహేందర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ · టీవీ.రమణ, ఏడీసీ సూపర్వైజర్, ఆర్టీసీ · డాక్టర్ సురేశ్, డీసీహెచ్‌ఎస్ · సందీప్‌కుమార్, డాటాఎంట్రీ ఆపరేటర్ · కళావతి, ఏఎన్‌ఎం ఏడబ్ల్యూటీ · లత, ఏడబ్ల్యూటీ · భోజన్న, పీఈటీ · మధుసూదన్, ఎఫ్‌ఆర్వో, పీడబ్ల్యూడీ · శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల · గంగమణి, ఆఫీసు సూపర్ ఇంటెండెంట్, మెడికల్ కళాశాల · గంగాధర్, డీపీవో ఆఫీస్ · డీఆర్‌ఓ నజీర్‌ఖాన్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్


స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోగల మసీదు ఎదురుగా నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని శుక్రవారం వేకువజామున నిర్మల్ నుంచి మెట్‌పల్లి వైపు అరటిపండ్ల లోడుతో వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. దీంతో గద్దె కూలి స్తంభం కిందపడింది. డీసీఎం వాహనం ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి


అర్చన (ఫైల్)

నిర్మల్ రూరల్: మండలంలోని చిట్యాల గ్రామం వద్ద రాఖీ పండుగ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అర్చన (18) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లికి చెందిన మహేశ్ వరుసకు చెల్లెళ్లయిన అర్చన, ఆద్యతో కలిసి జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న అర్చన చెల్లెలు అక్షయతో రాఖీ కట్టుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. చిట్యాల వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మహేశ్, ఆద్యకు స్వల్ప గాయాలు కాగా.. అర్చనకు తీవ్ర గాయాలయ్యాయి. అర్చన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అర్చన ఇంటర్ పూర్తి చేసి ఇటీవలే హైదరాబాద్‌లో బీటెక్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందింది. మరో వారంరోజుల్లో కాలేజీలో జాయిన్ కావాల్సి ఉండగా రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా, ప్రమాదానికి కారణమైన వాహనం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలానికి చెందిన ఓ వ్యక్తిదిగా రూరల్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వాహనాన్ని స్వాధీనం చేసుకుని రవాణాశాఖ అధికారికి అప్పగించి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడ్డందుకు చితకబాదిన ఎస్సై!

- ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు


బాధితుడు కిష్టయ్య

వేమనపల్లి: భార్యతో గొడవపడ్డందుకు తనను ఎస్సై చితకబాదాడని మండలంలోని సుంపుటం గ్రామానికి చెందిన అల్గం కిష్టయ్య ఆరోపించాడు. ఈ మేరకు ఎస్సైపై ఆరే కుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశంతో కలిసి సీపీ, డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సుంపుటం గ్రామానికి చెందిన అల్గం కిష్టయ్య నాలుగేళ్ల క్రితం నీల్వాయి కొత్త కాలనీకి చెందిన భారత ప్రమీలను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ప్రమీల పుట్టింటికి వెళ్లడం, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించిన అనంతరం తిరిగి కాపురానికి రావడం జరుగుతుండేది. 20 రోజుల క్రితం అనారోగ్యంతో ప్రమీల పుట్టింటికి వెళ్లింది. దీంతో కిష్టయ్య గత ఆదివారం ఆమె వద్దకు వెళ్లి కాపురానికి రావాలని గొడవ పడ్డాడు. దీంతో ప్రమీలతోపాటు ఆమె తల్లిదండ్రులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సురేశ్ భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేశాడు. అయితే గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశ్ ద్వారా రూ.10వేలు ఇవ్వాలని ఎస్సై తనను డిమాండ్ చేసినట్లు కిష్టయ్య ఆరోపించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తన భార్య, అత్తమామలు, మరికొందరి ముందే ఎస్సై తనను రోకలిబండతో తీవ్రంగా కొట్టాడని కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ విషయమై మూడురోజుల క్రితం రూరల్ సీఐ బన్సీలాల్, ఏసీపీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. శుక్రవారం రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీకి పోస్టు ద్వారా ఫిర్యాదు కాపీ పంపించినట్లు పేర్కొన్నాడు. ఎస్సై సురేశ్‌తో తనకు ప్రాణహాని ఉందని వాపోయాడు. తనపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఎస్సైతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

గిరిజనుల అభివృద్ధికి నిరంతర కృషి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు


జెండాకు వందనం చేస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. ముందుగా పీవో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఐటీడీఏ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యం, అభివృద్ధిపై దృష్టి సారించినట్లు చెప్పారు. 934 ప్రాథమిక పాఠశాలల్లో 12,017 మంది విద్యార్థులు చదువుతుండగా 1,449 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నట్లు తెలిపారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 31,749 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి పెంచిన చార్జీల ప్రకారం నూతన ఆహార మెనూ అమలు చేస్తూ నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు మినీ బాలికల గురుకులాలు, నాలుగు ఏకలవ్య పాఠశాలలు (కో–ఎడ్యుకేషన్), ఎనిమిది అప్‌గ్రేటెడ్ బాలికల జూనియర్ కళాశాలలు, నాలుగు అప్‌గ్రేటెడ్ జూనియర్ కళాశాలలు, ఒక బాలుర జూనియర్ కళాశాల, ఒక బాలికల జూనియర్ కళాశాల, రెండు మహిళా డిగ్రీ కళాశాలలు, ఒక పురుషుల డిగ్రీ కళాశాల ఉన్నట్లు తెలిపారు. గురుకులాల్లో 11,114 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 32 పీహెచ్‌సీలు, 186 ఆరోగ్య ఉప కేంద్రాలు, ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలుండగా వీటి ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 42 మందికి చికిత్స అందించినట్లు తెలిపారు. భూబదలాయింపు చట్టం కింద ఈ సంవత్సరం 25 కేసులు నమోదు చేసి 12 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మిగతా 13 కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. జీసీసీ ద్వారా ఉమ్మడి జిల్లాలో గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ ఆధ్వర్యంలో 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా, మంజూరైన 11 పెట్రోల్ పంపులను ప్రారంభించి నిరుద్యోగ గిరిజన యువతీయువకులకు ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. మగతా ఆరు పంపులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏవో దామోదరస్వామి, ఏడీఎంహెచ్‌వో మనోహర్, పీహెచ్‌వో సందీప్, పీవీటీజీ ఏపీవో మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది, ఆశ్రమ, గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీవ్ సద్భావన యాత్రకు వీడ్కోలు


రాజీవ్ జ్యోతితో మాజీ ఎంపీ బాపూరావు, కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: రాజీవ్ సద్భావన యాత్ర ఆదిలాబాద్ జిల్లాలో ముగిసింది. రాజీవ్ జ్యోతి యాత్ర చైర్మన్ ఆర్.దొరై ఆధ్వర్యంలో ఈ నెల 9న తమిళనాడులోని పెరంబుదూర్‌లో మొదలైన యాత్ర ఈనెల 19న దేశ రాజధానిలోని న్యూఢిల్లీలోని రాజీవ్‌గాంధీ సమాధి వీర్ భూమికి చేరుకుంటుంది. ఈ యాత్ర గురువారం రాత్రి ఆదిలాబాద్ పట్టణానికి చేరుకుంది. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో యాత్రీకులు రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం క్యాంపు ఆఫీస్ ఆవరణలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వారికి మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు జ్యోతిని దర్శించుకుని వీడ్కోలు పలికారు. 33 ఏళ్లుగా యాత్ర కొనసాగించడం అభినందనీయమని సోయం బాపూరావు కొనియాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైగలతో నృత్యం చేసి.. అందరి మెప్పు పొంది..


ఉపాధ్యాయుడి సైగలు చూస్తూ నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: వైకల్యమున్నా తాము అనుకుంటే సాధించలేనిదంటూ ఏమీ లేదని నిరూపించారు దివ్యాంగ విద్యార్థులు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఐటీడీఏ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వికాసం ప్రత్యేక బాలబడి విద్యార్థులు డ్యాన్స్ ఉపాధ్యాయుడు చేస్తున్న సైగలను చూసి వేస్తున్న స్టెప్పులు అందరినీ అలరించాయి. అధికారులు, విద్యార్థుల కేరింతలతో ఐటీడీఏ ప్రాంగణం హోరెత్తింది. సదరు ఉపాధ్యాయుడు, విద్యార్థులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పీవో ఖుష్బూ గుప్తా అభినందించారు.

నిందితుడి ఆచూకీ తెలిపితే నజరానా


సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడి చిత్రం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 8న ఓ వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి భారీ నగదు బహుమతి ఇస్తామని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సునీల్‌కుమార్, నాగరాజుతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడి ఆమె మృతి కారణమైన నిందితుడు స్థానిక రైల్వేస్టేషన్ గుండా పర్లి వైద్యనాథ్ ట్రైన్‌లో పరారైన విషయం సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడి ఎత్తు దాదాపు 5.4 అడుగులు ఉంటుందని, మరాఠీ భాష మాట్లాడే వ్యక్తిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితుడి వివరాలు తెలిస్తే ఆదిలాబాద్ డీఎస్పీని 8712659914, ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐని 8712659918, టూటౌన్ సీఐని 8712659920, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌ను 8712659965 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమాచారం తెలిపినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర, తెలంగాణలలో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో నిందితుడిని పట్టుకుంటామని పేర్కొన్నారు. రూరల్ ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది ఉన్నారు.